గురువారం
30 ఏప్రిల్ 2026
సంపుటి: 18 సంచిక:104
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

RNI No. APTEL/2008/24928Postal
Registration No.: VZM/22/2020-2022
Period of Renewal

# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

### బంగాల్‌లో బీజేపీ హవా?




2 లో

# ఓటెత్తిన పశ్చిమ బంగాల్



- రెండో విడతలోనూ రికార్డుస్థాయిలో పోలింగ్ నమోదు
- సాయంత్రం 6 వరకు 92.47 శాతం పోలింగ్
- స్వాతంత్ర్యం నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర చరిత్రలోనే రికార్డు
- నదియా జిల్లా చాప్రలో బీజేపీ ఏజెంట్‌పై రాడ్లతో దాడి.. తలకు ఆరు కుట్లు
- బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడింది: సీఎం మమతా బెనర్జీ వద్ద భవానీపూర్ బీజేపీ అభ్యర్థి సువేందు అధికారిని చుట్టుముట్టిన టీఎంసీ మద్దతుదారులు.. స్వల్ప లాఠీచార్జి



కోల్‌కతా, ఏప్రిల్ 29: పశ్చిమ బంగాల్ ఎన్నికల్లో బుధవారం జరిగిన రెండోదశలోనూ బంగాల్ ఓటర్లు పోటెత్తారు. ఓటర్లు భారీస్థాయిలో పోలింగ్‌కేంద్రాలకు తరలొచ్చి, తమ ఓటు హక్కును వినియోగించు కుని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్ప టి వరకు రాష్ట్రచరిత్రలోనే రికార్డు సృష్టించారు. బుధవారం సాయంత్రం 6 గంటల వరకే 92.47 శాతం ఓటింగ్ నమోదుకావడంతో.. ఇది కదా 'చునావ్ కా పర్వ్, పశ్చిమ బంగాల్ కా గర్వ్' అని ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ప్రశంసించారు. మొత్తం 294 స్థానాలకు తొలిదశలో ఈ నెల 23న 152 చోట్ల పోలింగ్ జరిగగా, దేశ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 93 శాతం ఓటింగ్ నమోదైన విషయం తెలిసిందేమిగిలిన 142 అసెంబ్లీ స్థానాలకు రెండోదశ పోలింగ్ బుధవారం జరిగింది. ఈ ఎన్నికలు

వివరాలు2లో..

### గంగా ఎక్స్‌ప్రెస్‌వేను


## ప్రారంభించిన ప్రధాని మోదీ

మహిళా బిల్లు వ్యతిరేకి కాంగ్రెస్

సమాజ్‌వాదీ, కాంగ్రెస్ అభివృద్ధికి ఆటంకాలు

దేశం మరోసారి ఈ పార్టీల అసలు స్వరూపం చూసింది

నారీ శక్తిని అడ్డుకున్న వారికి ప్రజలు బుద్ధి చెబుతారు




లక్నో, : మహిళా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సమాజ్‌వాదీ, కాంగ్రెస్ అభివృద్ధికి ఆటంకాలుగా మారాయని, దేశం ఇటీవల మరోసారి ఈ పార్టీల అసలు స్వరూపాన్ని చూసిందని, నారీ శక్తిని అడ్డుకున్న వారికి ప్రజలు బుద్ధి చెబుతారని విమర్శించారు. బంగాల్ మార్పు కోరుకుంటోందని, ఇందుకు ప్రజలు భారీస్థాయిలో పోలింగ్‌కేంద్రాలకు తరలిరావడం, రికార్డుస్థాయిలో ఓటింగ్ నమోదు కావడమే నిదర్శన మని స్పష్టం చేశారు.అభివృద్ధిలో ఉత్తరప్రదేశ్ దూసుకెళ్తోందన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయమైన మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు 594 కిలోమీటర్ల పొడవు గల గంగా ఎక్స్‌ప్రెస్‌వేని హర్దోయ్ జిల్లాలో బుధవారం ఏర్పా టు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని బటన్ నొక్కి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ విపక్షాలపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ అభివృద్ధికి, మహిళా బిల్లుకు వ్యతిరేకమని

వివరాలు2లో..

# డిసెంబరు నాటికి అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే


### డ్రోన్ సిటీ మొదటి దశ జులైకు పూర్తి-సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సేవలను డిసెంబరు నాటికి పూర్తిగా ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆర్‌టిజిఎస్‌లో ఉన్నతాధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 1,035 సేవలు అందిస్తున్నామని, ఇప్పటి వరకు 54 లక్షల మంది ప్రజలు 1.78 కోట్ల సేవలు పొందినట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇప్పటి వరకు 24 లక్షల మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అన్ని సేవలనూ 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకొస్తే ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం ఉండదని సిఎం అభిప్రాయపడ్డారు. కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ మొదటి దశ పనులు వేగంగా కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. ఇప్పటికే 8 సంస్థలకు భూములు కేటాయించగా, మే రెండో వారంలో ఈ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించ నున్నాయని చెప్పారు. డ్రోన్ సిటీ మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, ఈ ఏడాది జులై నాటికి మొదటి దశ పనులు పూర్తి చేయాలని సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో సిసి కెమెరాల వినియోగం దేశంలోనే అత్యధికంగా ఉందని అధికారులు వెల్లడించారు. వీటి సహాయంతో నేర నియంత్రణ, మిస్సింగ్ కేసుల ట్రేసింగ్, వాహన దొంగతనాల పరిష్కారం వేగవంతం అవుతుందన్నారు. సిసి కెమెరాలు లేని ప్రాంతాల్లో ప్రైవేట్ కెమెరాల డేటాను సమగ్రంగా అనుసంధానించాలని సిఎం సూచించారు. శాటిలైట్ డేటాను ఆర్‌టిజిఎస్‌కు అనుసంధానం చేసి రియల్ టైమ్‌లో స్పందించే వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఇటీవల తిరుమల సమీప




వివరాలు2లో..

## నేడు టెన్త్ ఫలితాలు విడుదల



2 లో

## రానున్న 2 రోజులు విభిన్న వాతావరణం



అమరావతి బ్యూరో : రాష్ట్రంలో ఈ నెల 30, వచ్చే నెల ఒకటో తేదీల్లో విభిన్న వాతావరణ పరి స్థితులు నెలకొనే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన అకాల వర్షాలు పడే అవకాశం ఉందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు ప్రఖర్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం నాడు విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, బొండపల్లి, రామభద్రపురం, పార్వతీపురం మన్యం జిల్లాలోని గరుగుబిల్లి, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, సాలూరు, సీతానగరం మండలాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని

వివరాలు2లో..

## మంచివాడిగా ఉండను: ట్రంప్

### సోషల్ మీడియాలో గన్ చేతబూనిన ఫొటోతో వార్నింగ్


వాషింగ్టన్, ఏప్రిల్ 29: ఇక మీదట తాను మంచివాడిగా ఉండనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఎకె చేతబూనిన ఓ చిత్రాన్ని విడుదల చేస్తూ పేర్కొన్నారు. అణు కార్యక్రమానికి సంబంధించి దౌత్యపరమైన పరిష్కా రం త్వరలో లభించకుంటే అమెరికా ఇరాన్‌పై కఠిన వైఖరి తీసుకుం టుందన్నారు. ఇరాన్ తెలివిగా వ్యవహరిస్తే మంచిదన్నారు. చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతుందని, అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదని అన్నారు. 'ఇకమీదట అంత మంచివాడిగా ఉండను'



వివరాలు2లో..

### లొంగుబాటు నుంచి మినహాయింపు

## ఉత్తర్వులు పాడిగింపు




2 లో

### టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా

# లోకేశ్ బాధ్యతల స్వీకారం

పార్టీ కేంద్ర కార్యాలయంలో అట్టహాసంగా జాతీయ, రాష్ట్ర కమిటీల ప్రమాణస్వీకారోత్సవం

మూడోతరంతోనూ కలసి పనిచేయనున్న గోరంట్ల, యనమల

తొలిసారిగా పొలిట్‌బ్యూరోలోకి మండల, క్లస్టర్ స్థాయి నేతలు

అమరావతి, : టీడీపీ జాతీయ, రాష్ట్ర కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం అట్టహాసంగా జరిగింది. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ బాధ్యతలు స్వీకరించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. పాత, కొత్త నేతల కలయికతో కమిటీలను టీడీపీ అధినాయకత్వం ఏర్పాటు చేసింది. పార్టీ చరిత్రలో తొలిసారిగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకూ పొలిట్‌బ్యూరోలో చోటు కల్పించారు. లోకేశ్ ఇచ్చిన 'కార్యకర్తే అధినేత' నినాదాన్ని నిజం చేస్తూ పని చేసిన



వివరాలు2లో..

# నేడు టెన్త్ ఫలితాలు విడుదల

అమరావతి, : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలను పాఠశాల విద్యాశాఖ గురువారం ఉదయం 11గంటలకు విడుదల చేయనుంది. ఈ మేరకు మంత్రి లోకేశ్ బుధవారం ఎక్స్‌లో వెల్లడించారు. విద్యార్థులు తీవంబశ్రీం.ఎంవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చు. మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009కు మెసేజ్ చేసి కూడా తెలుసుకోవచ్చు. లీప్ యాప్, డిజిలాకర్‌లోనూ ఫలితాలు అందుబాటులో ఉంచుతారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయుల లాగిన్లలో ఆయా పాఠశాల విద్యార్థుల ఫలితాలు తెలుసుకోవచ్చు. కాగా, రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 6.38లక్షల మంది ఈ ఏడాది పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా, 6.3లక్షల మంది పరీక్షలు రాశారు.

### లొంగుబాటు నుంచి
## మినహాయింపు ఉత్తర్వులు పొడిగింపు

అమరావతి, : మద్యం కుంభకోణం కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, భారతి సిమెంట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డిల బెయిల్ పిటిషన్లపై తుది నిర్ణయం తీసుకొనేంత వరకు లొంగుబాటు నుంచి వారికి మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశిస్తూ బెయిల్ పిటిషన్ల పై విచారణను జూన్ 24కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

## గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా విమర్శించారు. దేశం ఇటీవల మరోసారి వీరి అసలు స్వరూపాన్ని చూసిందని ఆయన మండిపడ్డారు. నారీ శక్తి వందన్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన పార్టీలను ఆయన నిలదీశారు.మహిళల సాధికారతను అడ్డుకోవడమే వీరి లక్ష్యమని ఆయన ఆరోపించారు. సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీలు అభివృద్ధికి ఆటంకాలుగా మారాయని ఆయ న దుయ్యబట్టారు. గతంలో వారి తీరు మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఆయన గుర్తు చేశారు. నారీ శక్తిని తక్కువగా అంచనా వేసే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. మహిళల హక్కుల కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని స్పష్టం చేశారుఉత్తరప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోం దని పేర్కొన్నారు. గంగా ఎక్స్‌ప్రెస్‌వే రాష్ట్రానికి కొత్త జీవనాడిలా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్ల రా ష్ట్రం వేగంగా పురోగమిస్తోందని తెలిపారు. పేదలు, రైతులు, యువత సంక్షేమమే తమ ధ్యేయమని వివరించారు. పశ్చిమ బంగాల్ ఎన్నికల పోలింగ్‌పై కూడా ప్రధాని స్పందించారు. అక్కడ ప్రజలు పెద్ద ఎత్తున ఓటు వేయడానికి తరలి వచ్చారని ఆయన హర్షం వ్యక్తం చేశారుదశాబ్దాల కాలంలో ఎన్నడూ చూడని విధంగా ఓటింగ్ జరిగిందని ఆయన చెప్పారు. బంగాల్ మార్పు కోరుకుంటోందన్నారు. గంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు వల్ల 12 జిల్లాల రూపురేఖలు మారిపోతాయని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌ను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ఈ రహదారి దోహదపడుతుందని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో యూపీ దేశానికే ఆదర్శమని ఆయన ప్రశంసించారు. గతంలో మీరట్ నుంచి ప్రయా గ్‌రాజ్ చేరుకోవడానికి సుమారు 10 నుంచి 12 గంటల సమయం పట్టేదని, ఈ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి రావడంతో ప్రయాణ సమయం 6 గంటలకు పరిమితం కానుందని చెప్పారు.మీరట్, హాపూర్, బులంద్ షహర్, అమ్రోహా, సంభాల్, బదాన్, షాజహాన్‌పూర్, హర్దోయ్, ఉన్నావ్, రాయబరేలి, ప్రతాప్‌గఢ్, ప్రయాగ్‌రాజ్ జిల్లాల ప్రజలకు ఇది గొప్ప వరం కానుందని అన్నారు. సుమారు రూ.37,350 కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మించామని, ఇది అత్యాధునిక ఆరు వరుసల రహదారని, భవిష్యత్తు అవసరాల దష్ట్యా దీనిని 8 వరుసలకు విస్తరించేలా డిజైన్ చేమని అన్నారు. అదనంగా 146 కిలోమీటర్ల విస్తరణతో మరిన్ని ప్రాంతాలు అనుసంధానం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షల మందికి పైగా బీజేపీ కార్యకర్తలు తరలివచ్చారు. జై శ్రీరామ్ నినాదాలతో సభామం డపం మారుమోగింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందీబెన్ పటేల్ సహా పలువురు రాష్ట్ర నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### డిసెంబరు నాటికి అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే

మొదటి పేజీ తరువాయి

శేషాచల అటవీ అగ్ని ప్రమాదం వంటి ఘటనలపై ముందస్తు స్పందనకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. డీజిల్, పెట్రోల్ సరఫరా సమస్యపై ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పరిస్థితి సాధారణ స్థితికి చేరిందని అధికారులు తెలిపారు. సమస్యలు తలెత్తే ముందు నుంచే స్పందించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## మంచివాడిగా ఉండను: ట్రంప్



మొదటి పేజీ తరువాయి

అని ట్రంప్‌పేర్కొన్నారు. అమెరికా ప్రతిపాదనలు తిరస్కరిస్తే తాము మరింత దూకుడుగా వ్యవహరిస్తామని ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారని నిపుణులు పేర్కొంటున్నారు.

# బంగాల్‌లో బీజేపీ హవా?

న్యూఢిల్లీ: దేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు ముగిసినా ఇంకా రాజకీయ వేడి తగ్గలేదు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఈ వేడిని మరింత పెంచాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే వెలువడిన ఎగ్జిట్ పోల్స్ పలు రాష్ట్రాల్లో అనూహ్య ఫలితాలు వస్తాయని అంచనా వేశాయి. ముఖ్యంగా మొదటినుంచీ చర్చనీయాంశంగా మారిన పశ్చిమ బంగాల్‌లో అధికార పార్టీ టీఎంసీ, ప్రతిపక్ష బీజేపీ మధ్య నువ్వానేనా అన్నట్లు పోరు సాగినట్లు తెలుస్తున్నది.ఆ రాష్ట్రంలో టీఎంసీ అధికారాన్ని నిలబెట్టుకుంటుందని పీపుల్స్ పల్స్, పోల్ ఆఫ్ ఎగ్జిట్ పోల్స్ సంస్థలు అంచనా వేయగా, బీజేపీ తొలిసారిగా అధికారంలోకి వస్తుందని మాట్రిజ్, పీ మార్క్ అంచనా వేశాయి. ఇక, తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ తిరిగి పీఠం దక్కించుకుంటుందని అన్ని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి.మరోవైపు కేరళంలో అనూహ్య ఫలితం వస్తుందని అన్ని సంస్థలు అంచనా వేశాయి. అధికార కూటమి ఎల్డీఎఫ్ ఓటమి పాలవుతుందని, యూడీఎఫ్ సర్కార్ రావడం ఖా యమని అన్ని ఎగ్జిట్ పోల్స్ ముక్తకంఠంతో తెలిపాయి. అసోంలో బీజేపీ అధికారాన్ని నిలుపుకొంటుందని అన్ని సంస్థలు అంచనా వేశాయి. కాగా, మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సంగతి తెలిసిందే.

తమిళనాడులో..

తమిళనాట మరోసారి అధికార డీఎంకేదే హవా నడిచినట్లు మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ సంస్థలు అంచనా వేశాయి. ముక్కోణపు పోరులో స్టాలిన్ నేతృత్వంలోని కూటమి విజయ దుందుభి మోగించనుందని అంచ నా కట్టాయి. మాట్రిజ్ సంస్థ డీఎంకే కూట మి 122-132 సీట్లు, అన్నాడీఎంకే కూటమి 87-100 స్థానాలు సాధిస్తాయని చెప్పింది. డీఎంకే కూటమి 148-168 స్థానాలు కైవసం చేసుకొని భారీ విజయం సొంతం చేసుకుంటుందని ప్రజాపోల్ తెలిపింది.

అయితే, ఎన్డీటీవీ-యాక్సిస్ మైఇండియా మాత్రం 98-120 స్థానాలతో నటుడు విజయ్ పార్టీ టీవీకే అధికారంలోకి వస్తుందని చెప్పడం విశేషం. టీవీకే రెండంకెల సీట్లతో మూడో స్థానానికే పరిమితమవుతుందని మెజారిటీ సర్వేలు అంచనా వేశాయి. కాగా, ఈ రాష్ట్రం లో మొత్తం 234 స్థానాలుండగా, అధికారం చేపట్టాలంటే 118 స్థానాలు అవసరం. మే 4న తుది ఫలితాలు వెల్లడి కానున్నాయి.

పుదుచ్చేరిలో..

కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో అధికార కూటమి మరోసారి అధికారంలోకి రావచ్చని అంచనాలు వెలువడ్డాయి. ఆలిండియా ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి 19-25 స్థానాలతో అధికారం చేపడుతుందని ప్రజాపోల్ అంచనా వేసింది.

కేరళంలో..

కేరళంలో సీపీఎం నాయకత్వంలోని ఎల్డీఎఫ్ కూటమికి ఎదురుదెబ్బ తగులుతుందని మెజారిటీ సంస్థలు అంచనా వేశాయి. పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ సర్కారు దిగిపోవడం ఖాయమని తెలుస్తున్నది. యూడీఎఫ్ కూటమి 78-90 స్థానా లు కైవసం చేసుకుంటుందని యాక్సిస్ మైఇండియా తెలిపింది.

అసోంలో..

ఈశాన్య రాష్ట్రం అసోంలో మరోసారి గత ఫలితాలే వస్తాయని తెలుస్తున్నది. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే అధికారం నిలబెట్టుకుంటుందని మెజారిటీ సంస్థలు చెప్పా యి. బీజేపీ కూటమి 88-100 స్థానాలు గెలుచుకునే అవకాశం ఉందని యాక్సిస్ మైఇండియా అంచనా వేసింది.

పశ్చిమ బంగాల్‌లో..

పశ్చిమ బంగాల్‌లో హోరాహోరీ పోరు సాగినట్టు మెజారిటీ సంస్థలు తెలిపాయి. ఈ రాష్ట్రంలో అధికారం చేపట్టబోయే పార్టీ స్వల్ప మెజారిటీతోనే అధికారంలోకి వస్తుందని అంచనాలు వెలువడ్డాయి. ఈ రాష్ట్రం లో మొత్తం 294 అసెంబ్లీ స్థానాలున్నాయి. అధికారంలోకి వచ్చేందుకు 148 స్థానాలు అవసరం.కాగా, టీఎంసీ 177-187 స్థానాలు కైవసం చేసుకుంటుందని, బీజేపీ 95- 110 సీట్లు పొంద వచ్చని పీపుల్స్ పల్స్ తెలిపింది. టీఎంసీ 146, బీజేపీ 140 స్థానాల్లో గెలుస్తాయని పోల్ ఆఫ్ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసింది. ఇక మ్యాట్రిజ్ బీజేపీ 146-161 స్థానాలు సాధిస్తుందని చెప్పగా, బీజేపీ 150-175 స్థానాలు సాధిస్తుందని పీ-మార్క్ చెప్పింది.

బంగాల్ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు

పోల్ ఆఫ్ ఎగ్జిట్ పోల్స్ - టీఎంసీ 146, బీజేపీ 140 పీపుల్స్ పల్స్ -- టీఎంసీ: 177--187, బీజేపీ 95-1-10 మ్యాట్రిజ్ -- టీఎంసీ : 125--140; బీజేపీ : 146-161 చాణక్య స్ట్రాటజీస్ -- టీఎంసీ: 130--140; బీజేపీ 150--160 పీ మార్క్ -- టీఎంసీ : 118--138; బీజేపీ : 150--175 పోల్ డైరీ - టీఎంసీ : 99- బీజేపీ : 142

తమిళనాడు ఫలితాలుపీపుల్స్ పల్స్

-- డీఎంకే: 125-145అన్నాడీ ఎంకేం: 65--80మ్యాట్రిజ్ - డీఎంకేం: 122--132; అన్నాడీఎంకే: 87--10పీపుల్స్ ఇన్సైట్ డీఎంకేం: 120-140; అన్నాడీఎంకే 60--70, పీమార్క్ డీఎంకేం: 125 అన్నాడీఎంకేం: 65

# ఓటెత్తిన పశ్చిమ బంగాల్

మొదటి పేజీ తరువాయి

అక్కడక్కడా చెదురుముదురు సంఘటనలు మినహా అంతా ప్రశాంతంగా ముగిశాయి. నదియా జిల్లా చాప్రలో బీజేపీ ఏజెంట్‌పై టీఎంసీ మద్దతుదారులు ఇనుపరాడ్లతో దాడి చేయ గా, ఆయన తలకు ఆరు కుట్లు పడ్డాయి. భవానీపూర్ అభ్యర్థి సువేందును ఓ పోలింగ్ బూత్ వద్ద టీఎంసీ మద్దతుదారులు చుట్టుముట్టడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చారుఈ సందర్భంగా తనను అడ్డుకున్న వాళ్లు బంగ్లాదేశ్ ముస్లింలని సువేందు ఆరోపించారు. డైమండ్ హార్బర్‌లోని ఫల్తాలో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని, బీజేపీ గుర్తు కన్పించకుం డా టేపు అతికించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఇక్కడ అన్ని బూత్‌ల్లో మళ్లీ పోలింగ్ నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ట్యాంపరింగ్ నిజమని తేలితే.. తిరిగి పోలింగ్ నిర్వహిస్తామని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.మరోపక్క భవానీ పూర్‌లో బీజేపీ, టీఎంసీ తీవ్ర ఆరోపణలు చేసుకున్నాయి. బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడిందని, ఎన్నికల పరిశీలకులు ఉగ్రవాదుల్లా వ్యవహరించారని సీఎం మమతా బెనర్జీ విమర్శించారు. అయితే మమతా బెనర్జీ బంగాల్ కంచుకోటను బీజేపీ బద్దలు కొట్టే అవకాశం ఉందని మూడు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. బంగాల్‌లో బీజేపీకే ఆధిక్యత వస్తుందని ఐదు ఎగ్జిట్ పోల్స్‌లో మూడు సర్వేలు వెల్లడించాయి. ఈ ఎన్నికల ఫితాలు మే 4న వెలువడనున్నాయిసువేందును చుట్టుముట్టిన టీఎంసీ మద్దతుదారులు.బంగాల్ ప్రతిపక్ష నేత, భవానీపూర్ బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి ఎన్నికల తీరును పరిశీలించేందుకు ఒక పోలింగ్ బూ త్ వద్దకు వెళ్లగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. టీఎంసీ మద్దతుదారులు అక్కడ కు చేరుకుని 'జై బంగాల్' నినాదాలు చేశా రు. కొద్దిసేపటికే వారంతా సువేందును చు ట్టుముట్టడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. దీంతో స్థానిక పోలీసులు, సీఆర్పీఎఫ్ వెంటనే జోక్యం చేసుకుని స్వల్పంగా లాఠీచార్జి జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా, పోలింగ్ బూత్ వద్ద తనను ముందు కు కదలకుండా చుట్టుముట్టిన వాళ్లంతా బంగ్లాదేశ్ ముస్లింలని సువేందు తెలిపారు. వాళ్లంతా భయంతో వణుకుతున్నారని, మమతా బెనర్జీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని అన్నారు. నదియా జిల్లా చాప్రలో హింస.. బీజేపీ ఏజెంట్‌పై దాడి..నదియా జిల్లాలోని చాప్ర నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తత హింసాత్మకంగా మా రింది. బుధవారం తెల్లవారుజామున సు మారు 5:30 గంటలకు, హత్రా పంచాయతీ పరిధిలోని బూత్ నెంబర్ 53 కు వెళ్తున్న బీజేపీ పోలింగ్ ఏజెంట్ మొషార్రఫ్ మీర్‌పై కొందరు దుండగులు ఇనుపరాడ్లు, కర్రలతో దాడి చేశారు. తృణమూల్ కాంగ్రె స్ (టీఎంసీ)కి చెందిన సుమారు 15 నుంచి 20 మంది వ్యక్తులు తుపాకులతో బెదిరిస్తూ తనను దారుణంగా కొట్టారని, ఈ దాడిలో తన తలకు తీవ్ర గాయాలయ్యాయని బాధితుడు ఆరోపించారు. పోలీసులు వెంటనే స్పందించి బాధితుడిని రక్షించి, చికిత్స నిమిత్తం చాప్ర గ్రామీణ ఆసుపత్రికి తరలించారుఈ దాడిలో మొషార్రఫ్ మీర్ తలకు ఆరు కుట్లు పడ్డాయి. ఈ ఘటనపై బీజేపీ ఎంపీ జగన్నాథ్ సర్కార్ తీవ్రంగా స్పందించారు. చాప్ర వంటి మైనారిటీ ప్రాబల్య ప్రాంతాల్లో టీఎంసీ అండతో గూండాయిజం సాగుతోందని, తమ పార్టీ ఏజెం ట్లను బూత్‌ల్లో ఉండనివ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన మండిప డ్డారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే, ఈ ఆరోపణలను టీఎంసీ నేతలు తోసిపుచ్చా రు. మరోవైపు, ఈ హింసాత్మక ఘటనల నే పథ్యంలో ఎన్నికల అధికారులు ఆ ప్రాంతం లో అదనపు బలగాలను మోహరించారు.

భవానీపూర్‌లో టీఎంసీ, బీజేపీ మధ్య మాటల యుద్ధం

భవానీపూర్ నియోజకవర్గంలో టీఎంసీ అధినేత, సీఎం మమతాబెనర్జీ, బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి మధ్య మాటల యు ద్ధం నడిసింది. ఈ ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతోందంటూ సీఎం మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. మరోవైపు బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

# టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ బాధ్యతల స్వీకారం

మొదటి పేజీ తరువాయి

వారికే కమిటీల్లో పెద్ద పీట వేశారు. పార్టీ ఆవిర్భవించిన 44 సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో పార్టీకి ఫ్రెష్ లుక్ వచ్చేలా కమిటీల నియామకం జరిగింది. సీనియర్ల సారథ్యం, జూనియర్ల దూకుడును సమపాళ్లలో కలుపుతూ కమిటీల నియామకం చేశామని చంద్రబాబు తెలిపారు. పొలిట్‌బ్యూరోలో చోటు దక్కించుకున్న మంగళగిరి క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తికొండ ధనుంజయ్, గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గతంలో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా పనిచేసిన వారికీ కమిటీల్లో చోటు కల్పించారు. ఎన్టీఆర్, చంద్రబాబు పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన సమయం లోనూ పార్టీ కమిటీల్లో కీలకంగా వ్యవహరించిన యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రస్తుతం లోకేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు తీసుకున్న కమిటీలోనూ కీలక బాధ్యతల్లో ఉండటం గమనార్హం. వీరిద్దరూ పొలిట్‌బ్యూరో సభ్యులుగా కొనసాగుతున్నారు.లోకేశ్‌కు అభినందనల వెల్లువటీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన లోకేశ్‌కు పలువురు నేతలు అభినందనలు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర నాయకులు ఆయనను కలసి అభినందనలు తెలిపారు. జన్మదినం కూడా కావడంతో లోకేశ్ తన చాంబర్‌లో ఎంపీతో కేక్ కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# రానున్న 2 రోజులు విభిన్న వాతావరణం

మొదటి పేజీ తరువాయి

అనంతగిరి మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 20 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. మరోవైపు ద్రోణి ప్రభావంతో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు. నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో బుధవారం 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపారు. 16 జిల్లాల పరిధిలోని 88 మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండి 41 డిగ్రీలకు పైగా నమోదైనట్లు వెల్లడించారు.

## మే 5న రణస్థలంలో మెగా జాబ్ మేళా




రణస్థలం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మే 5వ తేదీన రణస్థలంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో జరిగే ఈ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్, స్నైడర్ ఎలక్ట్రిక్, మ్యాన్‌కైండ్ ఫార్మా వంటి 14 ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొని సుమారు 675 ఖాళీలను భర్తీ చేయనున్నాయి. పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ చదివిన 18-30 ఏళ్ల మధ్య వయసున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎంపికైన వారికి శ్రీకాకుళం, విశాఖపట్నం, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ముందుగా ఱఅ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని, ఇంటర్వ్యూ రోజున ఉదయం 9 గంటలకే విద్యార్హత పత్రాలు, ఆధార్, రెజ్యూమే, ఫోటోలతో హాజరుకావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ సూచించారు. ఎంపికైన వారికి పోస్టును బట్టి నెలకు రూ 10,000 నుండి రూ 25,000 వరకు వేతనం ఉంటుందని, కొన్ని కంపెనీలు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కూడా కల్పిస్తాయని తెలిపారు. ఇతర వివరాలకు 8317652552 నంబరును సంప్రదించాలని కోరారు.

## పాత్రికేయులకు భద్రత కల్పించాలి

### : కాంగ్రెస్ పార్టీ డిమాండ్



పార్వతీపురం : రాష్ట్రంలో పాత్రికేయులు పట్ల జరుగుతున్న దాడులను అరికట్టాలని పార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బత్తిన మోహన్ కోరారు. కూటమి ప్రభుత్వంలో ఇటీవల కాలంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో పాత్రికేయుల పట్ల దాడులు మరియు కక్ష సాధింపు చర్యలు జరుగుతున్నవని ఆవేదన వ్యక్తం చేశారుచిత్తూరు జిల్లా జర్నలిస్ట్ హత్య మరువక ముందే పార్వతీపురం మన్యం జిల్లాలో పాత్రికేయులపై దాడి జరగటాన్ని తీవ్రంగా ఖండించారు. సమాజంలోని ప్రజా సమస్యలను, ప్రజల గొంతుకై ప్రభుత్వ కార్యక్రమాలను, రాజకీయ కార్యక్రమాలను, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా చేరవేసే పాత్రికేయులకు భద్రత లేకపోవడం బాధాకరమని ఈ సందర్భంగా తెలియజేశారు. మన్యం జిల్లాలో సాలూరులో పాత్రికేయులపై జరిగినటువంటి దాడి హేయమైన చర్యగా వర్ణించారు. రాష్ట్రంలో పాత్రికేయులకు భద్రత కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ తరఫున పాత్రికేయ మిత్రులకు మద్దతు ప్రకటిస్తూ పాత్రికేయుల పోరాటానికి సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధ్యక్షులు చొక్కాపు వెంకటరమణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు, కాంగ్రెస్ పార్టీ సీరియల్ నాయకులు, గిరిజన సంఘ నాయకులు పాలక రంజిత్ కుమార్, మన్యం జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు మర్రపు తిరుపతిరావు, జక్కువ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

### ఇది వరకే ఆమోదం పొందిన
### మహిళా బిల్లు యదాతదంగా అమలు చెయ్యాలి




విశాఖపట్నం : 2023 లోనే భారత పార్లమెంట్ ఏకగ్రీవంగా అమోదించిన మహిళా బిల్లు యదాతదంగా అమలు చెయ్యాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. గత ఐదు రోజులుగా విశాఖ నగరం కొమ్మాది శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు సోమవారంతో ముగిసాయి. ఈశ్వరయ్య పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మోసపూరితంగా మహిళా బిల్లు అని చెప్పి డిలిమిటేషన్ బిల్లుతో కలిపి పెట్టి ప్రతిపక్షాలు వ్యతిరేకంగా పని చేసాయని అబద్దాలు చెపుతూ దేశ ప్రజలను మభ్యపెట్టాలని చూడడం దుర్మార్గమన్నారు. మహిళలు తన కుటుంబం బాధ్యతలు చూసుకొంటూనే సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిస్కారం కోసం సైనికుల్లా పనిచెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష కార్యదర్సులు ఎ విమల, పి దుర్గా భవాని, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం పైడిరాజు, క్షేత్రపాల్, రాష్ట్ర మహిళా నాయకులు పి దుర్గాంబ, పద్మావతి, శ్రావణి, రాణి, వనజాక్షి, ఎం డి బేగం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అసమర్ధతే కారణం


**నియోజకవర్గ ఇన్చార్జ్ - డాక్టర్ దుర్గాప్రసాద్**



ప్రజాస్వామ్యం /గజపతినగరం:జిల్లా వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత కు ప్రభుత్వ అసమర్ధ పాలనే కారణమని నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ డాక్టర్ సరిది దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మధుపాడ లో విలేకరులతో మాట్లాడుతూ, పెట్రోలు, డీజిల్ ఇబ్బందులు దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు బారులు తీరడం.. నో డీజిల్ బోర్డులు బంకుల్లో దర్శనం ఇవ్వడం ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనం అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఇంధన కొరతను నివారించాలని అందుకు అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## మచ్చలేని నాయకుడు
# అప్పలనరసింహారాజు

**--- టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు**



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం సున్నితమైన, సువిశాలమైన, ఎటువంటి భావద్వేగాలకు తావివ్వకుండా మచ్చలేని రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గా అప్పలనరసింహారాజు నిలిచారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. మాజీ మంత్రి ఆర్.ఎస్.డి.పి. అప్పల నరసింహారాజు బుధవారం ఉదయం పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామంలో వారి స్వగృహంలో శివైకం పొందారని తెలుసుకున్న భీమిలి తెలుగుదేశం పార్టీ నాయకులు పాండ్రంగి వెళ్లి వారి భౌతికగాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గంటా నూకరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి నేటివరకు ఒకే రాజకీయ పార్టీలో ఉంటూ, అన్న నందమూరి తారక రామారావు ఆశయాలకు గాని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యదక్షకు గాని ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి వెన్నంటి ఉన్నారని అన్నారు. నియోజకవర్గం నుండి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి రాష్ట్ర మంత్రిగా పనిచేసిన రాజు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేసేవిధంగా, అన్ని ప్రాంతాలను సమపాలల్లో అభివృద్ధి పథంలో నడిపించిన మకుటంలేని మహారాజు అని అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ని తెలిపారు.

## విద్య లో పరీక్ష ఒక బాగం మాత్రమే - చావు పరిష్కారం కాదు!

**విద్యార్థులకు భీమిలి ఎస్సై సురేష్ హితవు**



భీమునిపట్నం ప్రజాస్వామ్యం పదవ తరగతి ఫలితాలు విడుదలవుతున్న తరుణంలో విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు పలు సూచనలు చేసిన భీమిలి ఎస్సై సురేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలో వచ్చే మార్కులు మీ మేధస్సును కొలవగలవు కానీ, మీ జీవిత విలువను నిర్ణయించలేవని మార్కులే జీవితం కాదని టెన్త్ రిజల్ట్ అనేవి మీ కెరీర్లో ఒక చిన్న మెట్టు మాత్రమే అని ఫెయిల్ అయినా లేదా తక్కువ మార్కులు వచ్చినా సృష్టించుకోవడానికి వెయ్యి అవకాశాలు ఉన్నాయని ఓటమి విజయానికి తొలిమెట్టని ఈరోజు ఫెయిల్ అయిన ఎంతో మంది గొప్ప వ్యక్తులు భవిష్యత్తులో అద్భుతాలు సాధించారని ఒక్క పరీక్ష తప్పినంత మాత్రాన మీరు జీవితంలో ఓడిపోయినట్లు కాదని భయం వద్దు.. ధైర్యంగా ఉండండి అని రిజల్ట్ చూసి భయపడకుండా ఏదైనా సమస్య ఉంటే మీ స్నేహితులతో లేదా నమ్మకమైన వారితో పంచుకోండని ఆత్మహత్య అనేది పిరికితనం అని అది మీ సమస్యను తీర్చదు సరే కదా.. మీ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగులుస్తుందని అన్నారు ఈ సందర్భంగా తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తూ పిల్లలను ఒత్తిడికి గురి చేయకుండా ఫలితాల సమయంలో పిల్లలపై అంచనాలు పెంచి వారిని ఆందోళనకు చేయకుండా తోడుగా నిలవలని తక్కువ మార్కులు వచ్చినా, ఫెయిల్ అయినా "మేమున్నాం" అనే భరోసా పిల్లలకు కల్పించాలని ఇతర పిల్లలతో మీ పిల్లలను పోల్చవద్దనిపరీక్ష తప్పితే మళ్ళీ రాసుకోవచ్చు కానీ ప్రాణం పోతే తిరిగి రాదని ఒక్కసారి ఫెయిల్ అయినంత మాత్రాన జీవితం అయిపోదని పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని పిల్లలకు మనోధైర్యం కల్పించాలని విద్యార్థులు తల్లిదండ్రులను కోరారు.

# విద్య ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**జిల్లా కలెక్టర్ - ఎస్. రాంసుందర్ రెడ్డి**

ప్రజాస్వామ్యం రామభద్రపురం, (విజయనగరం): నేటి పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే అతిపెద్ద మరియు శాశ్వతమైన ఆస్తి చదువు మాత్రమేనని, విద్య ద్వారానే విద్యార్థులకు గొప్ప భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. బొబ్బిలి మండలం పారాది గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయనతో కలిసి ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను





సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వసతి గృహంలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యా వాతావరణం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి చదువుకోవాలని, జిల్లాలో ఒక్క డ్రాపౌట్ కూడా లేకుండా చూడాలని అధికారులను కోరారు.అనంతరం ఎమ్మెల్యే బేబీ నాయన మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. గ్రామస్థుల కోరిక మేరకు పారాదిలో ప్రస్తుతం తాత్కాలిక భవనంలో హాస్టల్ను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే పాఠశాల భవనం సమీపంలోని ఐదు ఎకరాల ఖాళీ స్థలంలో కొత్త భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో పారాది వంతెన పనులను జూన్ నెలలోగా పూర్తి చేయాలని కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జ్యోతిశ్రీ, ఆర్డీవో మోహనరావు, సహాయ బిసి సంక్షేమ అధికారిణి రాజులమ్మ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఎంపిటిసి ఉమ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పిహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ప్రజాస్వామ్యం రామభద్రపురం, (విజయనగరం) :

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పిహెచ్సీ) జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ముందుగా హాజరు పట్టికను తనిఖీ చేసిన కలెక్టర్, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం మందుల నిల్వలు, ల్యాబ్ సౌకర్యాలు మరియు వార్డుల్లోని పారిశుధ్య పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించారరోగులతో ముఖాముఖి





మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న చికిత్స మరియు సిబ్బంది తీరుపై ఫీడ్బ్యాక్ తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని మరియు అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట పలువురు రెవెన్యూ మరియు ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మహిళా చట్టాల పట్ల విద్యార్థి విద్యార్థినులకు అవగాహన కల్పించిన భీమిలి ఎస్సై గౌరీ



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం భీమిలి కళా సాహితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల శిక్షణ శిబిరం లో మూడవ రోజు బుధవారం భీమిలి పోలీసులు ఆధ్వరంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఆడపిల్లలు రక్షణ గురించి సబ్ ఇన్స్పెక్టర్ గౌరీ వివిధ విషయాలు చెప్పారు. ప్రభుత్వం రూపొందించిన యాప్ లను వివరించారు. ఆడపిల్లలు నైతిక ప్రవర్తన గురించి హెచ్ సి అప్పలరాజు వివరించారు. కేరెర్ గైడన్స్ గురించి డా. ఎన్ ఎల్. రావు విద్యార్థులకు తెలియజేస్తూ ఏ ఉద్యోగం చేయడానికి ఏమి చదవాలో వివరించారు. పద్మనాభం కె. జి. బి. వి స్కూల్ ప్రిన్సిపల్ లిల్లి మేరీ పోలిపల్లి నర్సింగరావ్, పి. బాల, కే. పేమనందరావ్ వివిధ విషయాలు చెప్పారు. ఈ కార్యక్రమాలకు కళా సాహితీ అధ్యక్షులు పి. రాజేంద్ర ప్రసాద్ వర్మ అధ్యక్షత వహించగా ఎం.లక్ష్మణ్ రావు, ఏచ్చెర్ల హరి, పిన్నింటి ఎర్రయ్య రెడ్డి కార్యదర్శి ఎల్. ఆదినారాయణ, కాంటుబుక్త రామా నాయుడు తదితరులు హాజరయ్యారు.

# గజపతినగరం అన్న క్యాంటీన్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**-పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి, - నాణ్యత ప్రమాణాలు పాటించాలి- జిల్లా కలెక్టర్ - ఎస్. రాంసుందర్ రెడ్డి**

ప్రజాస్వామ్యం/ ?గజపతినగరం : బుధవారం గజపతి నగరం లోని అన్న క్యాంటీన్ను జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన క్యాంటీన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంటీన్ నిర్వహణ తీరును పర్యవేక్షించిన కలెక్టర్,





అక్కడ అందుతున్న భోజన నాణ్యతపై ప్రత్యేకంగా ఆరా తీశారు అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, నిర్వహణలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు మరియు నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు. నిరంతరం క్యాంటీన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన ఆదేశించారుఈ తనిఖీలో ఏఎంసీ చైర్మన్ పి.వి గోపాలరాజు , ఎంపీడీవో , రెవెన్యూ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

## బల్లంకిలో అంబరాన్నంటిన శ్రీదుర్గాదేవి ప్రతిష్ట మహోత్సవ సంబరాలు



వేపాడ : మండలంలోని బల్లంకి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదుర్గాదేవి ప్రతిష్ట మహోత్సవాలు మూడు రోజుల పాటు అంబరాన్ని అంటాయి. గ్రామ పెద్దలు యువకులు మహిళలు ఏకస్తులై అమ్మవారి పూజా కార్యక్రమాలను మూడు రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ ప్రతిష్ఠా మహోత్సవంలో, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తనయ, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జోన్ 1వర్కింగ్ ప్రెసిడెంట్ అనురాధ, ఎస్ కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, జెడ్పీటీసీ సభ్యులు ఎస్ అప్పారావు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గిబాబు, బానాది ఎంపీటీసీ సభ్యురాలు గొంప తులసీ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు దంపతులు, మాజీ సర్పంచులు డిఎం నాయుడు, గొర్లి నాగరాజు, గ్రామానికి చెందిన న్యాయవాది బల్లంకి కనకరాజు, బొడ్డు శ్రీనివాసరావు, దేగల ఈశ్వరరావు, బొడ్డు సన్యాసినాయుడు, బానాది వైసీపీ నాయకులు గొర్లి శంకరరావు,ఇతర గ్రామ పెద్దలు, వేలాది యువకులు మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని భర్తవానిపాలెం, మహిళా కోలాట ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే మధ్యాహ్నం 12గంటల నుంచి ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో సుమారు 3వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం 4గంటల నుంచి ఏర్పాటు చేసిన ఎడ్ల బండ్ల పరుగు పోటీలు ఉర్రూత లూగించాయి. డ్యాన్స్ బేబి డ్యాన్స్ నృత్య ప్రదర్శనలు యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి. కాగా గ్రామానికి చెందిన పల్లి వెంకటరమణ, లక్ష్మి దంపతులు ఆలయ నిర్మాణానికి సరిపడా లక్షా 40వేలు విలువైన గ్రానైట్ ను ఉదారంగా అందజేసి వారి భక్తిని చాటుకున్నారు.

# క్వారీ లారీలతో వ్యాపారం అభివృద్ధి చెందాలి

**ప్రశాంతి పట్నాయక్**

తగరపువలస, ప్రజాస్వామ్యం జీవిఎంసీ 2వ వార్డు వైకాపా ప్రధాన కార్యదర్శి, (విశాఖ జిల్లా క్వారీ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు) నమ్మివాని పేట కు చెందిన నమ్మి మాధవరావు తన క్వారీ లారీ వ్యాపార ప్రస్థానాన్ని ఘనంగా ప్రారంభించారు. మరిడమ్మ తల్లి అమ్మవారి ఆశీస్సులతో కొత్త క్వారీ లారీలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నమ్మి మాధవరావు చేపట్టిన ఈ కొత్త వెంచర్ అమ్మవారి దయతో దిగ్విజయంగా సాగాలని, ఆయన మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నియోజకవర్గం వైకాపా మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి జీరు వెంకట రెడ్డి, వైకాపా విశాఖ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరి కిరణ్ రెడ్డి, భీమిలి నియోజకవర్గ




మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, జీవీఎంసీ 2వ వార్డ్ ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, నమ్మి శ్రీరామ్, గ్రామ యూత్, అసోసియేషన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుండి కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు

భీమునిపట్నం, ప్రజాస్వామ్యం కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 11 వ బ్యాచ్ ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులను బుధవారం ప్రారంభిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరాం తెలియచేసారు. 10 వ తరగతి పాసైన విద్యార్థినిలకు ఈ కంప్యూటర్ శిక్షణ ఉచితంగా ఇస్తున్నట్లు శ్రీరాం తెలియచేసారు. ఈ శిక్షణా కార్యక్రమం లో కంప్యూటర్ ఫండమెంటల్స్, ఎం ఎస్ ఆఫీస్, ఎం ఎస్ వరల్డ్, ఎక్సల్, పవర్ పాయింట్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, ఆన్లైన్ ఎగ్జామ్స్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ప్రతీ రోజు సాయంత్రం 4.30 నుండి 6 గంటల వరకు ఉత్తమ ఉపాధ్యాయులతో శిక్షణ ఇవ్వబడుతుందని, ఆసక్తి గల విద్యార్థినులు 9643222666 నంబర్ కు సంప్రదించాలని కోరారు.



# భయపడుతున్న సమంత?

ఒకప్పుడు టాలీవుడ్ అనే కాక సౌత్ ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోనే టాప్ హీరోయిన్లలో ఒకరిగా ఒక వెలుగు వెలిగిన సమంత.. కొన్నేళ్ల నుంచి కథానాయికగా సినిమాలు చేయట్లేదు. 2023లో వచ్చిన శాకుంతలం తర్వాత ఆమె వెండితెరపై కనిపించింది తాను ప్రొడ్యూస్ చేసిన శుభమ్ అనే చిన్న సినిమాలో ఒక క్యామియో పాత్రతోనే. ఐతే చాలా గ్యాప్ తర్వాత ఇప్పుడు ఆమె మా ఇంటి బంగారం అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. తన భర్త రాజ్ నిడిమోరు రచనా సహకారం అందించిన ఈ చిత్రానికి సమంత క్లోజ్ ఫ్రెండ్ అయిన నందిని రెడ్డి దర్శకురాలు. ఈ చిత్రాన్ని మే 14న రిలీజ్ చేయబోతున్నట్లు కొన్ని నెలల ముందే ప్రకటించారు. ఈ దిశగా ఇటీవల ప్రమోషన్లు కూడా మొదలుపెట్టారు. ఒక పాట లాంచ్ చేశారు. వెన్నెల కిషోర్‌తో కలిసి ఒక ఫన్నీ ఇంటర్వ్యూ కూడా చేసింది సామ్. ఇదంతా చూస్తే మే 14న మా ఇంటి బంగారం పక్కాగా రిలీజవుతుందనే అనిపించిందికానీ ఇప్పుడు ఉన్నట్లుండి టీం ఆలోచన మారినట్లు తెలుస్తోంది. వేసవిలో ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రభావం సినిమాలపై గట్టిగానే పడుతోంది. పెద్ద సినిమాలు ఇంతకుముందులా వేసవిలో విడుదల కాకపోవడానికి.. రిలీజవుతున్న చిత్రాలకు ఆశించిన వసూళ్లు రాకపోవడానికి ఐపీఎల్ ఓ ముఖ్య కారణంగా భావిస్తున్నారు. మే 14 అంటే ఐపీఎల్ లీగ్ మ్యాచ్‌లు చివరి దశలో ఉంటాయి. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా నడుస్తుంటుంది. తర్వాత ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ఉంటాయికాబట్టి అప్పుడు యూత్ అంతా క్రికెట్‌కే అంకితమై ఉంటారనే ఆలోచనతో 14న రిలీజ్ చేయడానికి టీం తటపటాయిస్తోందట. టాక్సిక్ మూవీని జూన్ 4 నుంచి వాయిదా వేసిన నేపథ్యంలో ఆ డేట్‌ను తీసుకోవాలని సమంత అండ్ కో చూస్తోందట. డిస్ట్రిబ్యూటర్లు కూడా ఇది మంచి ఆలోచన అని చెప్పడంతో మా ఇంటి బంగారం చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు సమాచారం. త్వరలో ఈ మేరకు ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది. అందుకే ప్రమోషన్లను కూడా టీం హోల్డ్ చేసినట్లు సమాచారం.




### అమ్మ చీరతో...

# హీరోయిన్‌పై ప్రశంసలు

ఈ మధ్య కాలంలో చాలా మంది హీరోయిన్స్ తమ వివాహం సందర్భంగా ధరించే డ్రెస్‌లు, చీరలు చర్చనీయాంశం అవుతున్నాయి. లక్షలు ఖర్చు చేశారు, ఇంత ప్రాధాన్యత ఈ చీరకు ఉంది అంటూ చాలా వార్తలు వస్తున్నాయి. సోషల్ మీడియాలో పాపులర్ అయ్యి, సెలబ్రిటీ హోదా దక్కిన వారు కూడా తమ పెళ్లిని అంగరంగ వైభవంగా చేసుకుంటూ రచ్చ చేస్తున్నారు. సోషల్ మీడియాలో వారు షేర్ చేసే ఫోటోలు, వీడియోలు మామూలు హంగామా కాదు. సంపాదనతో సంబంధం లేకుండా లక్షలు ఖర్చు పెట్టి పెళ్లి చేసుకోవడం, ఫంక్షన్ లు చేయడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే కొందరు మాత్రం చాలా సింపుల్ వెడ్డింగ్‌కి ప్రాధాన్యత ఇస్తున్నారు. కొందరు రిచ్ వెడ్డింగ్ చేసుకుంటూనే సెంటిమెంట్‌కి ప్రాధాన్యత ఇస్తున్నారు. పెద్దలకు గౌరవం ఇచ్చే విధంగా తమ వివాహం ను ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది హీరోయిన్స్ తమ వివాహం సందర్భంగా ధరించే డ్రెస్‌లు, చీరలు చర్చనీయాంశం అవుతున్నాయి. లక్షలు ఖర్చు చేశారు, ఇంత ప్రాధాన్యత ఈ చీరకు ఉంది అంటూ చాలా వార్తలు వస్తున్నాయిమెహ్రీన్ పెళ్లి చీర...ఇక కొందరు హీరోయిన్స్ తమ తల్లికి చెందిన పెళ్లి చీర లేదా ప్రత్యేకమైన చీరను రీ డిజైన్ చేసి కట్టుకోవడం మనం చూస్తున్నాం. ఆ మధ్య నిహారిక కొణిదెల పెళ్లికి తన తల్లి చీర కట్టుకుని అందరినీ సర్‌ప్రైజ్ చేసిన విషయం తెల్సిందే. ఆ తర్వాత చాలా మంది సైతం తమ తల్లికి గౌరవం ఇస్తూ, సెంటిమెంట్‌ను గౌరవిస్తూ వచ్చారు. తల్లి పెళ్లి చీర కట్టుకుని పెళ్లి కూతురు కావడం అనేది ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. తాజాగా హీరోయిన్ మెహ్రీన్ తన తల్లి పెళ్లి చీరను కట్టుకోవడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. తల్లి యొక్క పెళ్లినాటి చీరను ఈతరంకు తగ్గట్లుగా డిజైన్ చేయించుకుని మెహందీ వేడుకలో ధరించింది. లెహంగా గాగ్రా ను మెహ్రీన్ ధరించి మెహందీ లో కనిపించింది. విభిన్నంగా ఉన్న ఆ లెహంగా గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతూ ఉండగా తన తల్లి పెళ్లి చీరతో దాన్ని డిజైన్ చేసినట్లుగా మెహ్రీన్ చెప్పిందిఅర్ష్ ఔలఖ్ ను వివాహం చేసుకున్న మెహ్రీన్..ఈనెల 26న అర్ష్ ఔలఖ్ ను వివాహం చేసుకున్న మెహ్రీన్ మెల్ల మెల్లగా తన వివాహ ఫోటోలను రివీల్ చేస్తూ వచ్చింది. పెళ్లికి ముందు వరకు మెహ్రీన్ సీక్రెట్‌గా ఉంచుతూ వచ్చింది. పెళ్లి అయిన కొన్ని గంటల తర్వాత రివీల్ చేసింది. పెళ్లిని సీక్రెట్‌గా ఎందుకు ఉంచాల్సి వచ్చిందని కొందరు ప్రశ్నిస్తున్నారు. మెహ్రీన్ ఈ మధ్య కాలంలో సినిమాలకు దాదాపుగా దూరం అయ్యింది. చాలా కాలంగా ఈమెకు ఆఫర్లు రావడం లేదు. మధ్యలో ఒకటి రెండు చిన్నా చితకా ఆఫర్లు వచ్చినా పెద్దగా ప్రభావం చూపించలేదు. అందుకే మెహ్రీన్ వైవాహిక జీవితంలో అడుగు పెట్టింది. పెళ్లి చేసుకున్నప్పటికీ నటించేందుకు ఆమె రెడీగానే ఉందని తెలుస్తోంది. అయితే ఇంతకు ముందే రాని ఆఫర్లు పెళ్లి తర్వాత వస్తాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయితల్లి చీరతో పెళ్లికి రెడీ...మొత్తానికి మెహ్రీన్ పెళ్లి చేసుకోవడం చర్చనీయాంశం అయింది. ఆ పెళ్లి మెహందీ వేడుకలో తల్లి పెళ్లి చీరను రీ డిజైన్ చేయించి లెహంగా గా మార్చడం ద్వారా మరింత వార్తల్లో నిలిచింది. కొంత మంది హీరోయిన్స్, సోషల్ మీడియా సెలబ్రిటీల మాదిరిగా కాకుండా తల్లి సెంటిమెంట్‌కు గౌరవం ఇస్తూ తల్లి పెళ్లి చీరను తన పెళ్లికి కట్టుకోవడం ద్వారా మెహ్రీన్ పై సోషల్ మీడియాలో ప్రశంసలు కురుస్తున్నాయి. ఇది తల్లికి ఆమె ఇచ్చే మంచి బహుమానంగా కూడా చాలా మంది అభివర్ణిస్తున్నారు. మెహ్రీన్ వివాహంకు సంబంధించిన మరిన్ని విషయాలు తెలియాల్సి ఉంది. అర్ష్ ఔలఖ్ తో మెహ్రీన్ ప్రేమ వ్యవహారం, పెళ్లి వరకు జర్నీ ఎలా సాగింది అనే విషయాలను ఆమె మీడియా ముందుకు వస్తే కానీ క్లారిటీ వచ్చే అవకాశం లేదు. ప్రస్తుతానికి సినిమాలు ఏమీ చేయడం లేదు కనుక ఇప్పట్లో ఆమె మీడియా ముందుకు వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది.



# ‘పెద్ది’ పహిల్వాన్ వెనక ఇంత కష్టం ఉందా?



స్టార్ హీరోలు గతంలో షర్ట్ నలగ కుండా, ఎలాంటి శారీరక శ్రమకు గురి కాకుండా, ఎలాంటి రిస్క్‌లని సైతం చేయాడానికి ఇష్టపడకుండా రిస్క్ షాట్‌లకు బాడీ డబుల్స్‌ని వాడేస్తూ హ్యాపీగా సినిమాలు చేస్తూ వచ్చారు. అయితే బాహుబలి తరువాత నుంచి లెక్కలు మారిపోయాయి. ప్రాధామ్యాలూ మారి పోయాయి. రిస్క్ తీసుకోకపోతే రేస్‌లో నిలవలేమని గుర్తించడం మొదలైంది. దీంతో ప్రతి స్టార్ హీరో స్టోరీ, క్యారెక్టర్ డిమాండ్ మేరకు ఎలాంటి రిస్క్ తీసుకోవడానికైనా వెనుకాడటం లేదుక్యారెక్టర్ డిమాండ్ చేస్తే ఎంత వరకైనా వెళుతున్నారు. ఎం చేయడానికైనా సిద్ధం అంటున్నారు. ఈ విషయంలో తాను కూడా రెడీ అంటూ నిరూపిస్తున్నారు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. ఆయన నటిస్తున్న భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా -పెద్ది-. బుచ్చి బాబు సాన దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా మూవీ జూన్ 25న భారీ స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. ఇందులో చరణ్ పెద్దిగా క్రికెటర్‌గా, మల్లయోధుడిగా కనిపించిబోతున్నాడఇప్పటికే విడుదలైన -పెద్ది- క్రికెటర్ లుక్, పహిల్వాన్ లుక్ సినిమాపై అంచనాల్ని పెంచడమే కాకుండా అభిమానుల్ని షాక్‌కు గురి చేసింది. ఒక్క మూవీలో క్యారెక్టర్‌లో రెండు వేరియేషన్‌లా అంటూ అభిమానులు, సినీ లవర్స్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా నెల రోజుల క్రితం హీరో రామ్ చరణ్ పుట్టిన రోజు సందర్భంగా -పెద్ది- పహిల్వాన్- పేరుతో గ్లింప్స్‌ని టీమ్ విడుదల చేసిందిఈ వీడియోలో శరీరాన్ని రాటు దేలిన ఇనుములా మలిచి కుస్తీకి రెడీ అయిన మల్లయోధుడిగా చూపించిన తీరు అందరిని ఆశ్చర్యపరిచింది. అలాగే గధని ధరించి చరణ్ చేసిన విన్యాసాలు, లంగోటీ ధరించి బరిలోకి దిగే యోధుడిగా చరణ్ పలికించిన హావ భావాలు, బాడీ లాంగ్వేజ్, గదని తిప్పిన తీరు ఆసక్తిని రేకెత్తించాయి. అయితే దీని వెనుక చరణ్ పడిన కఠోర శ్రమ దాగి ఉందని తెలిసింది. చరణ్ పహిల్వాన్ లుక్ కోసం కఠోరంగా శ్రమించారని, కఠిన ఆహార నియమాలు పాటించారని ట్రైనర్ రాకేష్ ఉడియార్ తాజాగా చెప్పుకొచ్చారు. చరణ్ కార్బ్ సైక్లింగ్ పద్ధతిలో రోజుకు 1,800, 2,500 కేలరీల ఆహారం తీసుకున్నారని, వారంలో మూడు రోజులు వెయిట్ ట్రైనింగ్, మిగిలిన రోజుల్లో కుస్తీ, గద శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. ఫిజియో థెరపీ, జాయింట్ కేర్‌తో గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. గతంలో -ఆర్ ఆర్ ఆర్- విషయంలోనూ ఫిజికల్‌గా ప్రత్యేకంగా కనిపించడం కోసం శిక్షణ తీసుకున్న చరణ్ ఆ మూవీ తరువాత -పెద్ది- కోసం ప్రత్యేకంగా బాడీ బిల్డింగ్ విషయంలో ప్రత్యేక శిక్షణ తీసుకోవడం గమనార్హం.



# 20 ఏళ్లకే పోకిరిని మర్చి పోయారేంటి?

తెలుగు సినిమా చరిత్ర పుటలను తిరిగేస్తే కొన్ని సినిమాలు ప్రముఖంగా కనిపిస్తాయి. అందులో ‘పోకిరి’ ఒకటి అనడంలో ఎలాంటి సందేహం లేదు. మహేష్ బాబును సూపర్ స్టార్‌గా మార్చిన ‘పోకిరి’ సినిమాతో దర్శకుడు పూరి జగన్నాథ్ డాషింగ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న విషయం తెల్సిందే. అప్పటి వరకు ఉన్న తెలుగు సినిమా రికార్డ్‌లన్నింటిని కూడా తూడ్చి పెట్టిన పోరికి సినిమా ఎంతో మందికి ఆల్ టైమ్ ఫేవరేట్ అనడం అతిశయోక్తి కాదు. మహేష్ బాబు ఇమేజ్‌ను అమాంతం పెంచేసిన పోకిరి సినిమా విడుదలై సరిగ్గా 20 ఏళ్లు పూర్తి అయింది. 2006 ఏప్రిల్ 28న ఒక మోస్తరు అంచనాలతో విడుదలైన పోకిరి సినిమా రోజులు గడుస్తున్నా కొద్ది హిట్.. సూపర్ హిట్.. బ్లాక్ బస్టర్.. ఇండస్ట్రీ హిట్‌గా మారుతూ వచ్చింది. ఇంటర్వెల్ సీన్, క్లైమాక్స్ నెవ్వర్ బిఫోర్ అన్నట్లుగా ఉండటంతో ప్రతి ఒక్కరూ సర్‌ప్రైజ్ అయ్యారుసూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన...పోకిరి వంటి సినిమాకు సంబంధించిన ఏ చిన్న విషయం అయినా మేకర్స్ పెద్ద ఎత్తున సెలబ్రేట్ చేయాల్సిన అవసరం ఉంటుంది. కానీ 20 ఏళ్ల అరుదైన మైలు రాయిని చేరుకున్నప్పటికీ పోరికి సినిమా గురించి చిన్న సెలబ్రేషన్ కూడా లేదు. ఆ మధ్య ఒక చిన్న హీరో సినిమా వచ్చి 20 ఏళ్లు అయిన సందర్భంగా హడావిడి చూశాం, అంతే కాకుండా ఆ సినిమాను రీ రిలీజ్ చేసి హంగామా చేశారు. కానీ పోకిరి సినిమా 20 ఏళ్ల సందర్భంగా ఫ్యాన్స్ హంగామా తప్ప మేకర్స్ నుంచి ఎలాంటి హడావిడి లేదు. దాంతో చాలా మంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం మేకర్స్ ముఖ్యంగా దర్శకుడు పూరి జగన్నాథ్ అయినా పోకిరి 20 ఏళ్ల సందర్భంగా ట్వీట్ లేదా ఒక యూట్యూబ్ వీడియో లేదంటే ఒక ఆడియో బైట్ అయినా ఇచ్చి ఉంటే బాగుండేది కదా అని అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారుటాలీవుడ్ బ్లాక్ బస్టర్ పోకిరి కి 20 ఏళ్లు..మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ‘వారణాసి’ సినిమాతో బిజీగా ఉన్నాడు. అందుకే పోకిరి సినిమా గురించి ఆయన కనీసం ట్వీట్ వేయలేక పోయాడు. ప్రస్తుతం ఆయన దృష్టి మొత్తం రాజమౌళి సినిమా పై ఉంటుంది అనడంలో సందేహం లేదు. పైగా మహేష్ బాబు ట్వీట్ వేయాలి అన్నా కూడా కచ్చితంగా రాజమౌళి పర్మీషన్ కావాల్సి ఉంటుంది. అందుకే మహేష్ బాబు పోకిరి 20

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022